క్లుప్తంగా

సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయాలి

దామెర : ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఊరుగొండలో విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో దామెర, ఆత్మకూరు, శాయంపేట మండలాల సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును ప్రారంభించారు. ముందుగా డేటాఎంట్రీ ఆపరేటర్లకు సర్వే వివరాల నమోదుపై శిక్షణ ఇచ్చారు. మండలాల్లో సర్వే చివరి దశకు చేరుకుందని, ఒకటి, రెండు రోజుల్లో వందశాతం పూర్తి కానున్నట్లు తెలిపారు. వీరి వెంట ఎంపీఓలు రంగాచారి, విమల, ఏఎస్ఓలు, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే వివరాలు ఆన్‌లైన్ ఎంట్రీ సోమవారం షురూ అయ్యింది. మండలంలో సర్వే 97శాతం పూర్తయ్యిందని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గుడెప్పాడ్‌లోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. 44 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ విమల, శ్రీదేవి, ఎన్యుమరేటర్లు డాటాఎంట్రీని పరిశీలించారు.

శ్రద్ధగా చదువుకోవాలి

ఆత్మకూరు : విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురుకులాల్లో నాణ్యమైన విద్య, భోజనం అందించడం జరుగుతుందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించే దిశలో ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు స్థలాల కేటాయింపు

ఐనవోలు : కక్కిరాలపల్లిలో స్కూల్, మండల కేంద్రంలో సామూహిక ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలాలను గుర్తించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు నివేదిక పంపించినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంలో భాగంగా మండలంలోని కక్కిరాలపల్లిలో సర్వేనంబర్ 528లో సుమారుగా 30 ఎకరాలు, అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 29లో 25 గుంటల భూమిని తహసీల్, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల భవన సముదాయానికి కేటాయించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు జిల్లా, ఎమ్మెల్యేకు పంపించినట్లు పేర్కొన్నారు.

సన్మానం

ఐనవోలు : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపీఓ గోపు రఘుపతిరెడ్డి ఇటీవల ఎన్నికయ్యారు. కాగా సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపి పూలబొకే అందించి సత్కరించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు జనుగాని అశోక్, రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనుగాని యశ్వంత్, పీఆర్ ఏఈ సత్యనారాయణ, ఏపీఓ కుమారస్వామి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఆర్యవైశ్య చార్టెడ్ ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి



వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా ఆర్యవైశ్య చార్టెడ్ వైస్ ప్రెసిడెంట్‌గా సీనియర్ న్యాయవాది తాటికొండ కృష్ణమూర్తి నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రమాణస్వీకారం అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన డాక్టర్ తాటికొండ కృష్ణమూర్తి గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే జిల్లా ఆర్యవైశ్య చార్టెడ్ లీగల్ సెల్ చైర్మన్‌గా న్యాయవాది భూపతి శంకర్ నియామకమయ్యారు. ఆర్యవైశ్య జిల్లా చార్టెడ్ తరుపున ఉపాధ్యక్ష, లీగల్ సెల్ చైర్మన్‌లకు రెండు జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాలు ఈ సందర్భంగా అభినందించారు.

రైతుల నిరసన



నడికూడ : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరుగు పేరితో రెండు నుంచి మూడు కిలోల కటింగ్ చేస్తున్నారని రైతులు ఆగ్రహించారు. ఈ మేరకు సోమవారం రాత్రి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. హమాలీ చార్జెస్ బస్తాకు రూ.50 వరకు వసూలు చేస్తున్నారని, ఇతర చోట ఆరబోసి కొనుగోలు కేంద్రానికి తరలిస్తే రూ.500 ఖర్చు అవుతుందని వాపోయారు.

కొయ్యలు కాలిస్తే నష్టమే

- వంటకాలం పూర్తికాగానే వరికొయ్యలు కాల్చుస్తున్న రైతులు
- భవిష్యత్ పంట సాగుకు నష్టమంటున్న వ్యవసాయశాఖ అధికారులు
- అవగాహనతో మార్పు రావాలని సూచన



పరకాల శివారులో వరికొయ్యలు కాల్చుతున్న ఓ రైతు (ఫైల్)

పరకాల : పంటకాలం పూర్తికాగానే రైతులు చేన్లల్లోని కొయ్యలకు నిప్పు పెట్టడం సాధారణంగా మారింది. కానీ అలా చేస్తే రైతులకు నష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు వ్యవసాయశాఖ అధికారులు. వాటిపై రైతులకు అవగాహన చాలా అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. వరి, మొక్కజొన్న కొయ్యలతో పాటు ఇతర పంటల కొయ్యలను కాల్చొద్దని హెచ్చరిస్తున్నారు. పోషకాల నష్టంతో పాటు వాయుకాలుష్యం, కీటకాల పెరుగుదల, జీవ వైవిధ్యం తగ్గడం, నీటి నిల్వ తగ్గడం వంటి అనర్థాలు జరుగుతాయని అంటున్నారు. పంటకాలం పూర్తైన అనంతరం కొయ్యలను కాల్చకుండా పునఃసంస్కరణలు చేసుకోవాలని, తద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి, పర్యావరణాన్ని పరిరక్షించొచ్చని సూచనలు చేస్తున్నారు.

కొయ్యలను కాల్చడం వలను జరిగే నష్టాలు

నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. తద్వారా భవిష్యత్ పంటల కోసం భూమి పనికి రాకుండా పోతుందని, వాయుమాలిన్యం ఏర్పడి ఊపిరితిత్తుల సమస్యలకు దారితీస్తుందని అంటున్నారు. ముఖ్యంగా తగలబడకుండా ఉన్న అవశేషాలు కీటకాలు, వ్యాధులకు నివాసాలుగా మారే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. మట్టిలోని సూక్ష్మజీవాలు దెబ్బతిని భూమి సమతూల్యం కోల్పోతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిలోని నీటి నిల్వా సామర్థ్యం తగ్గి భవిష్యత్ పంటలకు ఎక్కువ నీరు అవసరం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. మండలంలో రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని అంటున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వాస్తవానికి చాలా మంది రైతులు పంట కోతలు పూర్తికాగానే మళ్లీ సాగుచేయడం కోసం వరి, మొక్కజొన్న కొయ్యలను కాల్చుతున్నారు. అలా చేయడం వలన జరగబోయే నష్టాలను రైతులకు వివరించేందుకు ఏఈఓలను అప్రమత్తం చేయడంతో పాటు స్వయంగా వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. రైతుల్లో మార్పు వస్తుందని ఆకాంక్షిస్తున్నాం.

-ఎస్.శ్రీనివాస్, ఏఓ

కొలువుదీరిన నూతన పాలకవర్గం

- ప్రమాణస్వీకారానికి హాజరైన మంత్రి ప్రభాకర్



బాధ్యతలు స్వీకరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణి, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

కమలాపూర్ : మండలంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. ఈ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తౌటం ఝాన్సీరాణి-రవీందర్, వైస్ చైర్మన్‌గా దేశిని ఐలయ్యగౌడ్, పాలకవర్గ సభ్యులతో డీఎంఓ అనురాధ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి, సమస్య పరిష్కారించడంలో ముందుండాలని అన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గురుకులాల విద్యార్థులకు 40 శాతం మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకటో తారీఖున ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నామన్నారు.

ఉప్పల్ ఆర్వోబీ త్వరగా పూర్తిచేయాలి..

ఉప్పల్ ఆర్వోబీని త్వరగా పూర్తి చేయాలని కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. హుజూరాబాద్ నుంచి కమలాపూర్‌కు వస్తుండగా ఉప్పల్ వద్ద రైల్వే గేట్ పడటంతో మంత్రి అక్కడ కొద్దిసేపు ఆగి మాట్లాడారు. ఉప్పల్ రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్‌హెడ్ బ్రిడ్జికి తాను ఎంపీగా ఉన్నప్పుడు ప్రతిపాదనలు పంపానని, తర్వాత ఎంపీ వినోద్‌కుమార్ ఆర్వోబీకి శంకుస్థాపన చేశారని, ఆ తర్వాత ఎంపీగా బండి సంజయ్ రెండు సార్లు గెలుపొంది కేంద్ర మంత్రి అయ్యారని, అయినా ఆర్వోబీ మాత్రం అలాగే ఉందన్నారు. ఆర్వోబీ రైల్వే పార్ట్ వరకు మాత్రమే ఆగి ఉందని, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సహచర ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, నాయకులు నాగుర్ల వెంకటేశ్, అశోక్‌రెడ్డి, బాలసాని రమేశ్‌గౌడ్, చరణ్‌పటేల్, ఎంపీడీఓ బాబు, మార్కెట్ కార్యదర్శి రాజా, సూపర్‌వైజర్ యాకయ్య పాల్గొన్నారు.

పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



గోదావరి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

ఆత్మకూరు : కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీవేణు గోపాలస్వామి భజన మండలి భక్తులు ఆలయ అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో గోదావరి నదికి వెళ్లారు. ధర్మపురి సమీపంలోని కోటిలింగాల ఆలయం వద్ద గోదావరి నదిలో భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోటిలింగాల, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోదావరి నది వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పరకాల : నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సులోచన తెలిపారు. పట్టణానికి చెందిన సాదు సమ్మయ్య, బొజ్జం సారమ్మ, బొచ్చు రమేశ్ ఇళ్లపై దాడులు చేయగా 19 లీటర్ల నాటు సారా పట్టుబడినట్లు తెలిపారు. నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేలేరులో నలుగురిపై..

వేలేరు : ధర్మసాగర్ మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన మండల రవిపై దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో రవి చెల్లెలు రమ ఇంటివద్ద భూమికి సంబంధించిన గొడవ జరుగుతుండగా రవి అక్కడకు వెళ్లి గొడవ పడొద్దని, పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని చెప్పాడు. ఈ క్రమంలో రేసు అయిలయ్య, రేసు రంజిత్‌తో పాటు మల్కాపూర్‌కు చెందిన తోటకూరి రమేశ్, పాలకుర్తికి చెందిన అశోక్ బూతులు తిడుతూ రవిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరువ చేయండి



వివరాలు సేకరిస్తున్న కేంద్ర సచివాలయ అధికారులు

ధర్మసాగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతీ లబ్ధిదారుడికి చేరువ చేయాలని కేంద్ర సచివాలయ అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో సోమవారం కేంద్ర సచివాలయ అధికారులు సమావేశం నిర్వహించారు. సుధీర్ యాదవ్, బసంత్ నాథ్‌సైన్, రంజిత్ సింగ్, రమేశ్ దెశ్వాల్, సీమా అగర్వాల్, అనమిక గుప్తా, పంకజ్ కుమార్ ఝా, అంకిత వర్షిని, హనుమకొండ అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ పథకాల అమలు, కార్యక్రమాల వివరాలు సేకరించారు. రెవెన్యూ, హెల్త్, ఐకేపీ, విద్య, అంగన్‌వాడీ, ఉపాధి హామీ పథకం, తపాల శాఖతో పాటు తదితర శాఖల పనితీరును ఆయా శాఖల అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, తహసీల్దార్ సదానందం, మండల వైద్యాధికారి గోపీనాథ్, ఏపీఎం అనిత, ఎంపీఓ అఫ్జల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

ఆత్మకూరు : మంచి అలవాట్లతో విద్యార్థులు మానసిక ఆరోగ్యం కలిగి ఉంటారని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాజిటివ్ ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. నెగెటీవ్ ఆలోచనలు రానియొద్దని అన్నారు. చదువుపై శ్రద్ధ వహించి అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలని అన్నారు. ప్రతిరోజు నిర్ణీత సమయంలో ధ్యానం చేయాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ స్పందన, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉపప్రధాన అర్చకుడికి పరామర్శ



ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ఉపప్రధాన అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న పాతర్లపాటి రవీందర్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం అర్చకుడి ఇంటికెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మల్లన్న దీవెనలతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కుమారస్వామి ఉన్నారు.

మద్దతు ధర కోసం పోరాడుతాం

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ



మాట్లాడుతున్న పద్మ

కమలాపూర్ : రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర పొందేందుకు ప్రభుత్వాలపై పోరాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. మండలంలోని వంగపల్లిలో సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా కిసాన్ హనుమకొండ జిల్లా మూడోమహాసభలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ఇందుకు రైతులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను తేవడం ద్వారా రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సన్న వడ్లకు ఇస్తున్నట్లే దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు అన్ని పథకాలు వర్తింపజేయాలని అన్నారు. విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులు, యంత్రాలు సబ్సిడీపై అందించాలని, రైతులు పండించిన పంటలు దాచుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సకీర్త ఓదెలు, కార్యదర్శి ఉట్కూరు రాములు, పలువురు కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, ఓదెలు, రాజుగౌడ్, రాములు, లక్ష్మణ్, రమాదేవి, శ్యాంసుందర్‌రెడ్డి, మనోహర్‌రావు, భిక్షపతి, రాంమూర్తి, రవి, ఐలయ్య, బాలరాజు, శంకర్, మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించండి

- సీపీఎం మండల కార్యదర్శి లింగయ్య



మాట్లాడుతున్న లింగయ్య

ఐనవోలు : మండల వ్యాప్తంగా అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఎం పార్టీ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. మండలంలోని చాలా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. మల్లికార్జునస్వామి ఆలయంలో జాతర సంక్రాంతి నుంచి ఉగాది వరకు కొనసాగుతుండగా ప్రతీసారి ధర్మకర్తల మండలి ఏర్పాటు ఆలస్యం అవుతుందన్నారు. దీంతో ఆలయం అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. స్థానికులు, అన్ని పార్టీల, కమిటీల నాయకులతో పాలక మండలి ఏర్పాటు చేసి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం ఐనవోలు గ్రామ కార్యదర్శిగా మడిగె నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పరకాల : బీఆర్ఎస్ నాయకుడు, పోచారం గ్రామ మాజీ సర్పంచ్ పెండ్లి బాపురెడ్డి తల్లి శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



వెంకటయ్య (ఫైల్)

ఐనవోలు : అనారోగ్యంతో మాజీ సర్పంచ్ వెంకటయ్య మృతిచెందారు. 1994 నుంచి 2001 వరకు ఐనవోలు సర్పంచ్‌గా సేవలందించిన వెంకటయ్య (85) సోమవారం కన్ను మూశారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు అమరవాది సారంగపాణి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేర్వేరుగా వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఏసీపీ కిశోర్‌కుమార్



విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏసీపీ కిశోర్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం గంజాయి, మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై ఎస్సై ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని లక్షసాధన దిశగా అడుగులు వేయాలన్నారు. కౌమార దశలో మత్తు పదార్థాలకు బానిస అవడం వలన ఆరోగ్యం దెబ్బతిని నేర ప్రవృత్తి పెరిగి జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎన్నుకోవాలని, చెడు స్నేహానికి ఆకర్షితులు కావొద్దని అన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన, చెడు సహవాసాలు పెరగడం వలన ఒత్తిడి తట్టుకోలేక డ్రగ్స్‌కు బానిస అవుతారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎక్సైజ్ ఎస్సై సులోచన, మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కోటేష్, సమన్వయకర్త సునిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలి

- గోడువెళ్లబుచ్చుకున్న మాజీ సర్పంచ్‌లు



కమలాపూర్ : కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సాంబయ్య

కమలాపూర్ : తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించారు. పదవిలో ఉన్నప్పుడు అప్పులు చేసి పనులు చేశామని తెలిపారు. పనులకు సంబంధించిన బిల్లులు తమ పదవికాలం ముగిసి పదినెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రాలేదని వినతిలో పేర్కొన్నారు. బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్ రవీందర్‌రావు కోరారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందించారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

కమలాపూర్ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మండల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌లు జాగ్రత్తలు తీసుకున్నారు. మండలానికి చెందిన మాట్ల వెంకటేశ్వర్లు, శనిగరపు సమ్మయ్య, ఎండీ.దుర్వేష్, మాట్ల పున్నంచందర్ అనే నలుగురు బీఆర్ఎస్ నాయకులను సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



డోజర్ ప్రారంభించిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత అన్నారు. మున్సిపాలిటీ కొనుగోలు చేసిన ట్రాక్టర్ డోజర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. డోజర్ సేవలను ప్రజల అవసరాల నిమిత్తం కౌన్సిలర్స్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ సుష్మతో పాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోవాలి

- డీఎంహెచ్ఓకు నాయకుల ఫిర్యాదు



డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పరకాల: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులపై చట్టపరంగా చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి అప్పయ్యకు ఫిర్యాదు చేశారు. వైద్యం పేరిటా నిరుపేద నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడంతో పాటు లేనిపోని పరీక్షలు, స్కాన్‌ల పేరితో దోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, అధ్యక్షుడు కిశోర్, నాయకులు చిరంజీవి తదితరులు ఉన్నారు.

పంచకూట ఆలయంలో భక్తుల సందడి



నందీశ్వరుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహిమాన్విత శ్రీపార్వతీదేవి సమేత మహాదేవస్వామి పంచకూట శివాలయంలో సోమవారం అర్చకుడు రవీందర్‌శర్మ భక్తులతో పూజలు జరిపించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంలో కార్తీక సందడి నెలకొంది.

విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

ఎల్కతుర్తి : విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని ఎస్ఆర్‌టీ కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం తిరుపతి అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ఎస్ఆర్‌టీ కళాశాలలో యూఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించి లక్ష్యాలను ఛేదించాలని అన్నారు. అలాగే విద్యార్థులు చైతన్యవంతులై ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేశ్ మాట్లాడుతూ.. నేడు విద్యావ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నామై కొట్టుమిట్టులాడుతుందని పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే అవకాశం లేక వెనుకబడి పోతున్నారని అన్నారు. చదువును కొనుక్కునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.